క్లుప్తంగా

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజలు తమ ఫిర్యాదులను అధికారులకు అందజేయవచ్చని పేర్కొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతి


దామోదరం(ఫైల్)

బంగారుపాళెం: రిటైర్డ్ ఉపాధ్యాయుడు పొన్నేరి దామోదరం ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. మార్కెట్ యార్డు సమీపంలోని తన నివాస గృహంలో ఆయన ఒంటరిగా ఉంటున్నారు. భార్య రెండేళ్ల క్రితం మృతిచెందింది. ఉదయం గుండెపోటు రావడంతో సోఫాలోనే మృతిచెందాడు. దామోదరం మృతదేహాన్ని జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, పలువురు నేతలు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఉపాధ్యాయుడుగా, వైఎస్సార్‌టీఎఫ్ యూనియన్ నాయకుడుగా దామోదరం సేవలందించారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని బీరప్ప చెరువులో నేడు సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. దీర్ఘకాలిక రోగులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సేవకు గుర్తింపు


సోషల్ సర్వీసు అవార్డుతో సాయి

చిత్తూరు కలెక్టరేట్: సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు నగరంలోని ఇరువారానికి చెందిన సాయికి చెన్నైలోని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫర్ ప్రొటెక్షన్ కమిషన్ (ఐహెచ్‌ఆర్‌పీసీ) అందజేసింది. చెన్నైలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సాయి అవార్డు అందుకున్నాడు. ఆయన మాట్లాడుతూ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి

చిత్తూరు కార్పొరేషన్: స్థానికంగా బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఆయన ఆదివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో మూడుసార్లు అధికారంలోకి వచ్చిందన్నారు. కేంద్ర పథకాలను ప్రజలకు తెలియజేస్తూ సభ్యత్వ నమోదును పెంచాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం, నాయకులు విశాల్‌జైన్, గణేష్ పాల్గొన్నారు.

చిత్తూరులో తెరుచుకున్న అయ్యప్ప స్వామి ఆలయం



చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ప్రశాంత్ నగర్ కొండపై వెలసిన శ్రీ శాస్తాగిరి అయ్యప్ప స్వామి ఆలయాన్ని తెరిచినట్టు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా మండల పూజల నేపథ్యంలో డిసెంబరు 26వ తేదీ వరకు ఆలయాన్ని తెరిచి ఉంచుతామని పేర్కొన్నారు. అనంతరం ఐదు రోజులు ఆలయాన్ని మూసేసి డిసెంబరు 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 18వ తేదీ వరకు ఆలయాన్ని తెరిచి ఉంచుతామని వెల్లడించారు. ప్రతి రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 11 వరకు, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆలయంలో స్వామి వారిని భక్తులు దర్శించుకోవచ్చన్నారు.

కవులకు ఘన సన్మానం


గ్రంథాలయంలో కవులకు సన్మానం

చిత్తూరు కార్పొరేషన్: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా శక్తి, యుక్తి పెరుగుతాయని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గిరిధర్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చిత్తూరులోని జిల్లా గ్రంథాలయంలో ఆదివారం కవులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ వేలాది మంది మహానుభావులు రచించిన పుస్తకాలను చదవడంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. కుటుంబ విలువలు, స్నేహ బంధాలు, ఆరోగ్య, వ్యక్తిత్వ వికాసంతో కూడిన పుస్తకాలు చదవాలని రచయిత్రి మిట్టాలక్ష్మి తెలిపారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కవి కృష్ణవేణి పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ లలిత, సహాయ లైబ్రేరియన్ గజేంద్రబాబు పాల్గొన్నారు.

కష్టాల్లో గ్రంథాలయాలు

పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుంది. అందుకే విద్యార్థులు పుస్తక పఠనం చేయాలని పెద్దలు చెబుతూ ఉంటారు. ప్రతి ఒక్కరికీ విలువైన పుస్తకాలు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో గ్రంథాలయాలను ఏర్పాటుచేశారు. అక్కడికి వెళ్లి అనేక మంది తమకు కావాల్సిన పుస్తకాలు, గ్రంథాలను తీసుకుని చదువుకుంటూ ఉంటారు. విజ్ఞాన భాండాగారాలుగా పేరొందిన గ్రంథాలయాలు కష్టాల్లో కూరుకుపోయాయి. సిబ్బంది కొరత పట్టిపీడిస్తుండడంతో నిర్వహణ సక్రమంగా ఉండడం లేదు. దీంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు.



సిబ్బంది కొరతతో తెరుచుకోని బైరెడ్డిపల్లెలోని గ్రంథాలయం

- 74 మంది ఉద్యోగుల కొరత
- ఒక్కో ఉద్యోగికి రెండు, మూడుచోట్ల ఇన్‌చార్జి బాధ్యతలు
- నిధులు ఇవ్వకుండా వారోత్సవాలా..?

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీంతో గ్రంథాలయాలను సక్రమంగా నిర్వహించడం లేదు. పుస్తకాలు చదువుకునేందుకు ఆసక్తితో వచ్చే పాఠకులు గ్రంథాలయాలకు తాళాలు వేసి ఉండడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు, అలాగే చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. వారంతా నెలలో సగం రోజులు కూడా గ్రంథాలయంలోకి అడుగుపెట్టలేకపోతున్నారు. దీనికి తోడు గ్రంథాలయవారోత్సవాల నిర్వహణకు నిధులు రాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

74 మంది సిబ్బంది కొరత

చిత్తూరు జిల్లాలో 72 గ్రంథాలయాలు ఉన్నాయి. వాటిలో 115 మంది సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం 41 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసిన తర్వాత ఆయా పోస్టులను భర్తీ చేయకపోవడం, కాంట్రాక్టు పద్ధతిలోను కొత్త వారిని తీసుకోకపోవడంతో తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుతం 74 మంది ఉద్యోగులు కొరత ఉన్నారు. గ్రేడ్- 2 గ్రంథాలయాల్లో 9 పోస్టులకుగాను 6 ఖాళీలు ఉన్నాయి. అలాగే గ్రేడ్-3 గ్రంథాలయాల్లో 59 అధికారుల పోస్టులకుగాను 37 ఖాళీలు ఉన్నాయి. రికార్డు సహాయకులు ఐదుగురికి గాను ఒకరు మాత్రమే ఉన్నారు. అటెండర్లు 31 మంది ఉండాలి. 28 ఖాళీలు ఉన్నాయి. వాచ్‌మెన్ నాలుగు పోస్టుల్లో రెండు ఖాళీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒక్కో గ్రంథాలయ అధికారికి రెండు లేదా మూడు గ్రంథాలయాలను అప్పగించారు. కొన్నిచోట్ల జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లతో నెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో పలు గ్రంథాలయాలను 3 నుంచి 4 రోజులు మాత్రమే తెరుస్తున్నారు. లైబ్రేరియన్ ఒకచోట విధులు నిర్వర్తిస్తుంటే.. ఇన్‌చార్జిగా ఉన్న గ్రంథాలయాలకు తాళం పడుతోంది. దీంతో అక్కడి పాఠకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా సగానికి పైగా లైబ్రరీల్లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి. ఉన్నతాధికారులు స్పందించి, ఖాళీలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులకు, విద్యార్థులకు గ్రంథాలయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు ఇవ్వకుండా వారోత్సవాలా..?

కూటమి ప్రభుత్వం గ్రంథాలయాలను చిన్నచూపు చూస్తోంది. గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణకు నిధులు విడుదల చేయకుండా మొండిచేయి చూపింది. ఉత్సవాల ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేసిన సర్కారు.. నిర్వహణకు దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించడం గమనార్హం. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుల నుంచి వారోత్సవాల నిర్వహణకు బడ్జెట్ మంజూరైన తర్వాత నిధులు కేటాయిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొనడం చర్చనీయాంశమైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ.35 వేలు, ప్రధాన మున్సిపాలిటీల్లో ప్రథమ శ్రేణి గ్రంథాలయాలకు రూ.15 వేలు, ద్వితీయ శ్రేణికి రూ.12 వేలు, మండల కేంద్రాల్లోని తృతీయ శ్రేణి లైబ్రరీలకు రూ.8 వేల చొప్పున ఏటా నిధులిచ్చారు. ఈ ఏడాది నిధుల కేటాయింపులు లేకపోవడం, ఇప్పటి వరకు జీతాలు కూడా చెల్లించకపోవంతో సిబ్బంది తర్జనభర్జన పడుతున్నారు. వ్యాసరచన, సెమినార్, క్విజ్, చిత్రలేఖనం, పాటలు, ముగ్గుల పోటీలు, చదరంగం, ఇతర ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు, అతిథులకు సన్మానాలు, పిల్లలకు స్నాక్స్ ఎలా ఇవ్వాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. దాతల కోసం వెతుకులాట ప్రారంభించారు.

వరసిద్ధునికి విరాళాల వెల్లువ


విరాళం అందజేస్తున్న దాత కుటుంబీకులు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి పలువురు దాతలు ఆదివారం నగదు విరాళాలు సమర్పించుకున్నారు. ఐరాల మండలం చినకంపల్లికి చెందిన చైతన్యరెడ్డి, రోహిత్‌రెడ్డి బాల క్రిష్టారెడ్డి జ్ఞాపకార్థం గోసంరక్షణ ట్రస్టుకు రూ.5,01,116 విరాళం చేశారు. అలాగే పలమనేరుకు చెందిన దాత కృష్ణయ్య నిత్యాన్నదానానికి రూ.1,00,116 ఆలయ అధికారులకు అందజేశారు. యూఎస్‌ఏకు చెందిన మహేష్‌కుమార్ అన్నదానం ట్రస్టుకు రూ.లక్ష నగదు విరాళం అందించారు. గుంటూరు జిల్లాకు చెందిన ఒబులిశెట్టి వెంకట రామకృష్ణ రూ.1,00,116 విరాళంగా ఆలయ అభివృద్ధికి సమర్పించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నేడు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా తెలియజేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖల మండల అధికారులు హాజరవుతారని తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


కవి సమ్మేళనం నిర్వహిస్తున్న సుజాత

ఐరాల: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారిణి సుజాత అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు కవి సమ్మేళనం, సెమినార్లు, రచయితల సందేశాలను వినిపించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పుస్తకంలో విశేష విజ్ఞాన సంపద ఉందని, పుస్తక పఠనం మానవ మనుగడకు దోహదపడుతుందని తెలిపారు. పుస్తకాలు విద్యార్థులకు మంచి సంస్కారం నేర్పుతాయని వివరించారు. ఉపాధ్యాయుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రకృతి ఆరాధనతోనే మానవ మనుగడ



పోస్టర్ల ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రకృతి ఆరాధనతోనే మానవ మనుగడ సాధ్యమని ప్రముఖ సాహితీవేత్త, యూనివర్సల్ పీస్ క్రాస్ వ్యవస్థాపకులు మత్రిపూడి దేవేంద్రరావు పేర్కొన్నారు. చిత్తూరు నగరం పలమనేరు రోడ్డులోని ఆ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం సందర్భంగా 11 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు-2024 ప్రదానం చేశారు. మనషికి వరం ప్రకృతి అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రకృతి ధర్మాలను ఉల్లంఘించడం నేరమన్నారు. ప్రకృతి కల్పించే వనరులను ప్రజలు కాపాడుకోవాలన్నారు. తోట గోవిందన్, కోటీశ్వరన్ సంయుక్తంగా మాట్లాడుతూ నీటి కాలుష్యంతో పాటు వాయు, వాతావరణ, పారిశ్రామిక, శబ్ద కాలుష్యాల వల్ల భూమిపై జీవవైవిధ్యం దెబ్బతింటోందని హెచ్చరించారు. ఎస్.మునీంద్ర, ఎం.మొహిద్దీన్ అలీ మాట్లాడుతూ ఓజోన్ పొర క్షీణిస్తోందని, భూతాపాన్ని అరికట్టలేని స్థితిలో లక్షలాది మంది మరణిస్తున్నారని తెలిపారు. కాలుష్యాన్ని అరికట్టడం సామాజిక బాధ్యతగా ప్రతివ్యక్తి గుర్తించుకోవాలన్నారు. అనంతరం పర్యావరణ సూత్రాలను ముద్రించిన పోస్టర్లను సంఘసేవకులు ఆవిష్కరించారు. కె.ఆనందనాయుడు, రమేష్ బాబు, ఎస్.హరిబాబు, ఎన్.షణ్ముగం, డి.రోహిత్, విద్యార్థులు ఎస్.భావన, కె.ఈశ్వర్‌ప్రసాద్, ఎస్.శావంత్, టి.ఎస్.ప్రవళ్లిక, హెచ్.మోనిక పి.దర్శన్ పాల్గొన్నారు.



యోగా చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

చిత్తూరు కలెక్టరేట్: యోగాతో ఒత్తిడిని జయించవచ్చని, ఎన్‌సీసీ కేడెట్లు యోగాలో మెళకువలు తెలుసుకోవాలని 35 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ మోనిస్ తెలిపారు. జిల్లా కేంద్రమైన చిత్తూరులోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం ఎన్‌సీసీ కేడెట్లకు యోగా గురువు, అధ్యాపకుడు మోహన్ బెహ్రా ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆసనాలు వేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్లు ప్రసాద్‌రెడ్డి, కార్తీక్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

1,500 లీటర్ల సారా ఊట ధ్వంసం


సారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

గుడిపాల: మండలంలో 1500 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. రాసనపల్లె అటవీ ప్రాంతంలో సారా తయారు చేస్తున్నారని సమాచారం రావడంతో ఆదివారం సిబ్బందితో వెళ్లి దాడులు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా 1,500 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామన్నారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గంజాయి విక్రయాలు చేస్తే పీడీ యాక్టులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా గంజాయి విక్రయిస్తుంటే 9440796712కు తెలియజేయాలని కోరారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఆదివారం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. చెన్నమగుడి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సీఐ జయరామయ్యకు సమాచారం అందింది. ఆయన ఆదేశాలతో ఎస్‌ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి చెన్నమగుడి పల్లె సమీపంలో దాడులు చేశారు. ఈ క్రమంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

పలమనేరులో నిఘా ముమ్మరం


బల్బులు అందజేస్తున్న ఎస్పీ

పలమనేరు: పట్టణంలో పోలీస్ నిఘా ముమ్మరం చేస్తున్నట్టు ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. ఆమేరకు ఇక్కడి ట్రాఫిక్, బ్లూకోట్స్ సిబ్బందికి అవసరమైన లైటింగ్ లైట్లు, సామగ్రిని స్థానిక డీఎస్పీ ప్రభాకర్‌కు ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నామని ఆయన తెలిపారు. ముఖ్యంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చొరవచూపుతామన్నారు.

ఇద్దరు బెల్టు షాపుల నిర్వాహకుల అరెస్టు


నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు పరిధిలో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అర్బన్ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు పోలీసులు ఆదివారం చిత్తూరు శివారులోని మురకంబట్టులో తనిఖీలు చేశారు. ఉదయ్ కుమార్ (37) తన కిరాణా దుకాణంలో మద్యం బాటిళ్లను విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతని నుంచి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లె - పిబి.నత్తం కూడలిలో 12 మద్యం బాటిళ్లు కలిగివున్న వెంకటేశ్వర్లురెడ్డి(48)ని అరెస్టు చేశారు. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరచి చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ కృష్ణమోహన్, సిబ్బంది శరవణ, దినకర్, లోకేష్, రేఖ, సంధ్య తదితరులు పాల్గొన్నారు. కాగా బెల్టు దుకాణాలకు ఎవరైనా మద్యం సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలితే, మొదటి సారి రూ.5 లక్షల జరిమానా విధిస్తామని, రెండోసారి లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా సారా విక్రయాలు చేస్తున్నా, బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నా 9440902530 నంబరుకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీహరి తెలిపారు.

గ్రామకంఠం భూములకు రిజిస్ట్రేషన్

తవణంపల్లె: మండలంలో గ్రామకంఠం భూములను అనుభవంలో ఉన్న వారు నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తవణంపల్లె తహసీల్దార్ సుధాకర్ స్పష్టం చేశారు. మండలంలో చాలా మంది ప్రజలు గ్రామకంఠంలో ఉన్న భూములు రిజిస్ట్రేషన్ కోసం వీఆర్‌ఓ, సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి సంతకాలతో కూడిన సర్టిఫికెట్ తేవాలని రిజిస్ట్రేషన్ అధికారులు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. దీంతో రెవెన్యూ కార్యాలయానికి తిరిగి అసహనానికి గురవుతున్నారు. రిజిస్ట్రేషన్ అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామకంఠంలో ఉన్న భూమిని వారి రికార్డుల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. దీనిపై ప్రజలకు ఎలాంటి అపోహలు వద్దని సూచించారు. మండలంలో కోర్టులో జరుగుతున్న భూవివాదాలకు సంబంధించిన భూములు మినహా ఎలాంటి భూ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చిన అర్జీలకు ప్రాధానత్య ఇచ్చి పరిష్కరిస్తామన్నారు.

టీకాలతో జీవితానికి రక్షణ



చిన్నారులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

- గర్భిణులు, పురిటి బిడ్డలకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది
- అవగాహన లేమితో దూరంగా ఉంటున్న గ్రామీణులు
- ప్రతి బుధ, శనివారాల్లో ఉచితంగా టీకాలు

గుడిపాల: వ్యాధుల బారి నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన చిన్నారుల వరకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు వేయిస్తే వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సరైన అవగాహన లేక టీకాలు వేయించుకోవడం లేదు. దీంతో వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి శని, బుధవారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి టీకాలను వేస్తున్నారు. చిత్తూరు నియోజకవర్గంలో గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లో పీహెచ్‌సీలతో పాటు 26 వైఎస్సార్ క్లినిక్‌లలో టీకాలు వేస్తున్నారు. దీంతో పాటు చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి, సబ్‌సెంటర్‌లలో కూడా టీకాలు వేయడం జరుగుతుంది.

వ్యాక్సిన్‌లు ఇలా..

- గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలలు నిండిన తరువాత ఒక టీటీ ఇంజెక్షన్, అనంతరం ఇంకో నెలరోజుల వ్యవధిలోనే మరో టీటీ ఇంజెక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్ ఫోలిక్, కాల్షియం టాబ్లెట్స్ ఇస్తారు.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హైపటైటిస్-బీడోస్ వేయాలి. వీటి వల్ల పోలియో, పచ్చకామెర్ల వ్యాధి నుంచి రక్షణ కల్పిస్తుంది. 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి. 6, 14 వారాల్లో ఐపీ చుక్కలు వేయించాలి.
- 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటి వల్ల కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు.
- తొమ్మిది నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్-ఏ చుక్కలు వేయించాలి. తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకూ ప్రతి ఆరునెలలకు ఒకసారి విటమిన్-ఏ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు ఇప్పించాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోస్ డీపీటీ, మీజిల్స్, విటమిన్-ఏ ఓపీని వేయించాలి.

టీకాలు తప్పనిసరి..

గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలి. వీటి వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా టీకాలు వేస్తున్నాం. మారుమూల ప్రాంతాల వారికి టీకాలపై అవగాహన కల్పిస్తున్నాం.



– డాక్టర్ సంధ్య, వైద్యురాలు, గుడిపాల పీహెచ్‌సీ

ఊరించి.. ఉసూరుమనిపించి..

- ధర లేక కారుకాయలు విలవిల
- ఆందోళనలో మామిడి రైతులు


విరగ్గాసిన మామిడి కారుకాయలు


కొమ్మలు విరిగేలా కాచిన కారుకాయలు

తవణంపల్లె: మామిడి పంట అన్ సీజన్‌లో ఆశాజనకంగా కారు కాయల దిగుబడి వచ్చింది. కానీ కారు కాయల ధరలు పడిపోవడంతో రైతులు విలవిలలాడుతున్నారు. గత రెండేళ్లుగా కారుకాయలు దిగుబడి కోసం రైతులు సకాలంలో మందులు పిచకారీ చేసి, ఎరువులు వేయడంతో మంచి దిగుబడి వచ్చింది. ధరలు కూడా కిలో రూ.70 తగ్గకుండా వ్యాపారస్తులు కొనుగోలు చేశారు. దీంతో మరికొంత మంది రైతులు మామిడి చెట్లకు ఎక్కువ పెట్టుబడి అయినా కల్తార్ మందు వేశారు. దీంతో పాటు ఎరువులు వేసి యాజమాన్య పద్ధతులు పాటించారు. కల్తారు ఎరువులు వాడిన రైతులకు 50 శాతం మేరకు దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. అరగొండకు చెందిన రైతు వివేకానందరెడ్డి 20 ఎకరాల మామిడి తోటలో చెట్లకు కల్తారు మందు వేశారు. కారుకాయలు మచ్చపడకుండా ఐదు మార్లు మందులు పిచికారీ చేశారు. అదేవిధంగా చాలా మంది రైతులు కల్తార్ మందులు వాడి కాయలకు మచ్చపడకుండా మందులు పిచికారీ చేశారు. దిగుబడి వచ్చిన మేరకు మామిడి సంతోషపడినా మార్కెట్ ధరలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇది ఇలాఉండగా కారుకాయలు ధరలు లేకపోగా సాధారణంగా మామిడి చెట్లు పూత వచ్చి కాపు వస్తుందా అని మదనపడుతున్నారు. వాతావరణ పరిస్థితులు వల్ల కారుకాయలకు మచ్చలు రావడంతో ధరలు తగ్గిపోయాయి. బంగారుపాళ్యం మార్కెట్లో కిలో కారుకాయలు రూ.25 నుంచి రూ.30 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీనిపై బంగారుపాళ్యం ఉద్యాన అధికారి సాగరికను విచారించగా మండలంలో వెంగంపల్లె పరిసరాల్లోని మామిడి రైతులు కల్తార్ వాడడం వల్ల కారుకాయలు దిగుబడి వచ్చింది. కానీ తిరుపతి, చెన్నై మార్కెట్ తరలిస్తే రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉంది. బంగారుపాళ్యం మార్కెట్లో కిలో కారుకాయలను ట్రేడర్లు రూ.20 నుంచి రూ.30 వరకు కొనుగోలు చేస్తున్నారు. మామిడి సీజన్‌లో ధరలు లేకపోవడంతో కారుకాయలు దిగుబడి వస్తే మంచి ధరలు వస్తాయని ఆశించిన రైతులకు నిరాశమిగిల్చింది.